క్లుప్తంగా

నేడు పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం

కోటవురట్ల : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు కోటవురట్ల మండలంలో గురువారం పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మండలంలోని పి.కె.పల్లి, రామన్నపాలెం, బోడపాలెం, కొత్తూరు, పాత తంగేడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మురుగు పోయేందుకు చర్యలు



మురుగు పోయేందుకు కాలువ తవ్వుతున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

రాంబిల్లి: దిమిలి పల్లపు వీధిలో మురుగు నీరు పోయేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం కూలీలు మురుగు పోయేందుకు కాలువను తవ్వారు. గత నెల 3న మురుగుతో అవస్థలు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి జి. రాజుబాబు పనులు చేయించారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో గ్రామ పెద్దలు

రాంబిల్లి : కొత్తపేట గ్రామంలో బుధవారం రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. దాతల విరాళాలతో రామాలయం నిర్మించనున్నారు. భూమి పూజ సందర్భంగా భక్తులు భజనలు చేశారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణలత, గ్రామ పెద్దలు జగన్నాథరావు, రాజుబాబు, బాబూరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



హెడ్ లేని కుళాయి పైపు

రాంబిల్లి : దిమిలిలో తాగునీటి కుళాయిలకు హెడ్‌లు ఏర్పాటు చేయలేదు. పలు కుళాయిలకు హెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. జల్ జీవన్ మిషన్ పథకంలో ఈ గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. మూడు నెలల కిందట ఏర్పాటు చేసిన కొన్ని కుళాయిలకు హెడ్లు బిగించకుండానే అస్తవ్యస్తంగా వదిలేశారు. దీంతో తాగునీరు వృథాగా పోతుంది. అసలే వేసవి కావడంతో రెండు మూడు రోజుల కోసారి తాగునీరు సరఫరా అవుతోంది. ఈ తరుణంలో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : పురుషోత్తపురం 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11కేవీ ఫీడర్ విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా గురువారం 7 గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ కె. రాజశేఖర్ బుధవారం రాత్రి స్థానిక మీడియాకు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా పురుషోత్తపురం, పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం, రేగుపాలెం, వెంకునాయుడుపాలెం, రామభద్రాపురం, లైనుకొత్తూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి తమ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షేమం, అభివృద్ధికి రెండు ఓట్లు..

- ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే భవిష్యత్తు
- ఐదేళ్ల పాలనే గీటురాయి
- జగన్ ప్రభుత్వంలో గడప వద్దకే పాలన
- విద్య, ఆరోగ్యం, మహిళా సంక్షేమానికి పెద్దపీట
- చంద్రబాబు పాలనలో అంతా మోసం, జన్మభూమి కమిటీల దోపిడీ
- జోరుగా కంబాల జోగులు ఎన్నికల ప్రచారం
- ఊరూరా అపూర్వ స్పందన



పాములవాకలో ఎన్నికల ప్రచారం సందర్భంగా జోగులుకు హారతి ఇస్తున్న మహిళలు. చిత్రంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజు

కోటవురట్ల : అమ్మా ఈ ఐదేళ్లు సీఎం జగన్ మీకు సంక్షేమాన్ని ఎలా అందించారో తెలుసు..గతంలో చంద్రబాబు పింఛను డబ్బులు ఇవ్వడానికి ఎంత ఇబ్బంది పెట్టేవాడో చూశారు..జగన్ సీఎం అయ్యాక అవ్వా తాతలకు, అక్కా చెల్లెమ్మలకు కొండంత అండగా నిలిచారు. మళ్లీ ఇంత కంటే గొప్పగా జగన్ మీకు ఆసరాగా ఉంటారు. మీరు చేయాల్సింది రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేయాలి..మర్చిపోకండమ్మా అందరూ బాగుండాలంటే మళ్లీ జగనే సీఎం కావాలి అంటూ పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఓటర్లను అభ్యర్థించారు. గతంలో చంద్రబాబు పాలన, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యత్యాసాన్ని చూడాలన్నారు. మండలంలోని ఆక్సాహేబుపేట, చినబొడ్డేపల్లి, కొత్తూరు, నీలిగుంట, పాములవాక గ్రామాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కంబాల జోగులుకు అపూర్వ స్పందన లభించింది. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. మా ఓటు ఫ్యాను గుర్తుకే అంటూ తెగేసి చెప్పారు. మళ్లీ జగన్ బాబునే గెలిపించుకుంటామని అవ్వా తాతలు స్పష్టం చేశారు. మండుటెండను సైతం లెక్కచేయక మహిళలు, అభిమానులు ఆయన వెంట వీధుల్లో స్వచ్ఛందంగా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కంబాల జోగులు మాట్లాడుతూ ఈ ఎన్నికలు చాలా కీలకమని ఇటువంటి సమయంలో చంద్రబాబు మాయమాటలను తిప్పికొట్టి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని పారదర్శకంగా అందించారు కాబట్టే సంక్షేమాన్ని చూసి మాత్రమే ఓటు వెయ్యాలని జగన్ కోరుతున్నారన్నారు. గతంలో ఎవరూ కూడా ఇలా ధైర్యంగా ఓటు అడగలేదని, పేదలకు కొండంత అండగా నిలిచారు కాబట్టే జగన్ ధైర్యంగా మళ్లీ ఓటు అడుగుతున్నారన్నారు. చంద్రబాబుకు ఓడిపోతారని తెలిసే దుష్టులతో జటకట్టారని విమర్శించారు. ఎంతమంది జతకట్టి కుట్రలు పన్నినా పేదలంతా సీఎం జగన్ వైపే ఉన్నారన్నారు. అభివృద్ధి లేదంటూ టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు ప్రతి గ్రామంలో నిర్మించి పేదలకు ఇబ్బంది లేకుండా ధైర్యంగా బతికేలా జగన్ భరోసా కల్పించారన్నారు. పేదలు బాగుంటే అది అభివృద్ధి కాదా ? అని ప్రశ్నించారు. గతంలో జన్మభూమి కమిటీలు ఎలా దోచుకున్నారో అందరికీ తెలుసన్నారు. ఇపుడు జగన్ ప్రభుత్వంలో ఉన్న ఊళ్లోనే సమస్త సేవలు అందుతున్నాయన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలను అద్భుతంగా అభివృద్ధి చేయడంతో పదోతరగతి పరీక్ష ఫలితాలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వచ్చాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పల్లెల్లో కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటికే వైద్యులు వెళ్లి చికిత్స అందిస్తున్నారన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా విత్తు నుంచి ఎరువులు ఇస్తూ పంట ఇంటికొచ్చేంత వరకు అండగా ఉంటున్నారన్నారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు మాట్లాడుతూ పేదల కోసం ఇంతలా తపించే ముఖ్యమంత్రిని తమ జీవిత కాలంలో చూడలేదన్నారు. పరిణతి చెందిన ఓ గొప్ప నాయకుడు, సేవకుడు సీఎం జగన్‌లో ఉన్నాడన్నారు. వ్యవస్థలను ఓ గాడిలో పెడుతూ లంచగొండితనాన్ని రూపుమాపుతూ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు బంగారు భవితను ఇచ్చి మహిళలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ సంక్షేమం మరింతగా అమలు కావాలంటే ఎమ్మెల్యేగా కంబాల జోగులుకు, ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ కిల్లాడ సాయి, నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ బుల్లిదొర, సర్పంచులు పైల శివరామ్, కోసూరు అప్పారావు, కొరుప్రోలు శివకుమార్, వరహాలబాబు, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, మాజీ సర్పంచులు పైల సత్యనారాయణ, సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, శింగంపల్లి కిషోర్, అవుగడ్డి దుర్గారాజీవ్, పోతల సత్తిబాబు, పైల నాని, అల్లు కిషోర్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి చామంతుల శ్రీనివాసు పాల్గొన్నారు.

వైఎస్ జగనే మళ్లీ సీఎం కావాలి



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక: సంక్షేమం, అభివృద్ధి కోసం మళ్లీ వై.ఎస్.జగన్ ప్రభుత్వాన్నే మళ్లీ ఎన్నుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మునగపాక దళితవాడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి పక్షాల మాయ మాటలు నమ్మి మోసపోకుండా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. అనకాపల్లి ఎంపీ, యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీలతో గెలిపించాలన్నా రు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు ఆడారి కాశీబాబు, పిల్లి అప్పారావు, పొలిమేర గణేష్, బొడ్డేడ మహేష్, బీలా శివగణేష్, టిక్కలి కొండలరావు, ఎం.ఎం. నాయుడు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రచారంలో 'ఫ్యాన్' జోరు



తిమ్మాపురం ఉపాధి కూలీలను ఓటు అడుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొరుప్రోలులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాల్తేరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దేవవరపు వెంకటేశ్వరరావు

ఎస్.రాయవరం : పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు గెలుపునకు మద్దతుగా నాయకులు ప్రచారం మరింత స్పీడు పెంచారు. ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో పార్టీ నాయకులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఓటర్ల వద్దకు పదే పదే వెళ్లి ఫ్యాను గుర్తు మరచిపోవద్దని పోలింగ్ రోజున రెండు మార్లు బటన్ నొక్కి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేను గెలిపించుకుని జగనన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. తిమ్మాపురం, కొరుప్రోలు, గుడివాడ తదితర గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం ఎంపీటీసీ బొండా వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొండా దివాణం, శ్రీనివాసరావు, మందగుదుల వెంకటరమణ, యర్రా జగదీష్, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ చేకూరి శ్రీరామచంద్రరాజు, పార్టీ నాయకులు నక్కా నాగేశ్వరరావు, కొంగర రాజు, పోలవరపు సత్యనారాయణ, పినపాత్రుని శ్రీనివాసరావు, పేరిచర్ల శ్రీపతిరాజు, గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీనిబాబు పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి నాయకులు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మే 13 న జరగబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కంబాల జోగులును, ఎంపీగా బూడి ముత్యాల నాయుడును గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న, సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అన్నారు. అందువల్ల మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే గెలిపించుకోవాలని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఫ్యాన్ గుర్తు బ్రోచర్లను ఓటర్లకు పంపిణీ చేశారు.

నామినేషన్ల దాఖలుకు నేడే గడువు

- బుధవారం 4 నామినేషన్లు దాఖలు
- కాంగ్రెస్ నుంచి 2 డీబీపీ నుంచి 1
- కాంగ్రెస్ రెబెల్ 1



డీబీపీ తరఫున నామినేషన్ వేసిన కృష్ణ స్వరూప్

నక్కపల్లి: నామినేషన్ల దాఖలుకు ఒక్కరోజే గడువుంది. గురువారంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తి కానుంది. దీంతో పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి నామినేషన్ల దాఖలు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జైభారత్ నేషనల్ పార్టీతోపాటు, ఇండిపెండెంట్‌గా ఒకరు నామినేషన్లు వేశారు. తాజాగా బుధవారం కాంగ్రెస్ పార్టీ తరఫున డాక్టర్ బోని తాతారావు, దళిత బహుజన పార్టీ తరఫున వడ్లమాని కృష్ణ స్వరూప్, కాంగ్రెస్ రెబెల్(ఇండిపెండెంట్‌గా) పాయకరావుపేటకు చెందిన మాజీ ఎమ్మెల్యే దివంగత మారుతి ఆదెయ్య కుమారుడు మారుతి నారాయణ చక్రవర్తి నామినేషన్లు దాఖలు చేశారు. వీరంతా నామినేషన్ పత్రాలతోపాటు అఫిడవిట్లను రిటర్నింగ్ అధికారి కె. గీతాంజలికి అందజేశారు. ఇప్పటి వరకు వైఎస్సార్‌సీపీ తరఫున 3 సెట్లు, టీడీపీ తరఫున మూడు సెట్లు, జైభారత్ నేషన్ పార్టీ నుంచి ఒకటి, కాంగ్రెస్ నుంచి 2, ఇండిపెండెంట్ల నుంచి 2 సెట్లనామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు రెబెల్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బుధవారం రెబెల్‌గా నామినేషన్ వేసిన నారాయణ చక్రవర్తి మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు గత కొద్ది నెలలుగా కష్టపడి పనిచేస్తున్నానని, అధిష్టానానికి తన బయోడేటా ఇచ్చి పాయకరావుపేట టికెట్ తనకు కేటాయించాలని కోరానన్నారు. కానీ అధిష్టానం శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న బోని తాతారావుకు కేటాయించిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ తాను కాంగ్రెస్ రెబెల్‌గా పోటీచేయాలని నిర్ణయించుకుని నామినేషన్ దాఖలు చేయడానికి రావడం జరిగిందన్నారు. పార్టీ కార్యకర్తల మద్దతు తనకే ఉందన్నారు.

యలమంచిలిలో ప్రచార హోరు

- వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల ముమ్మర ప్రచారం
- ఓటర్ల నుంచి అపూర్వ ఆదరణ



ఎన్టీఆర్ కాలనీలో ఎమ్మెల్యే కన్నబాబుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు



కొత్తపాలెంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కన్నబాబును గెలిపించాలని ఓటర్లను కోరుతున్న నాయకులు

యలమంచిలి రూరల్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి యలమంచిలి పట్టణంలో పలు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, క్రియాశీలక కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వార్డుల్లో ఇంటింటా ప్రచారానికి ప్రజల నుంచి ముఖ్యంగా మహిళల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. పట్టణంలోని నెహ్రూనగర్, యాతపేట, కొత్తపేట, ఎన్టీఆర్, ఏఎస్సార్ కాలనీలు, ధర్మవరం, పెదపల్లి, కొత్తపాలెం, ఎర్రవరం ఇలా ఒకేసారి దాదాపుగా అన్ని వార్డుల్లో ప్రచారానికి నాయకులు పూనుకోవడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది. ఐదేళ్లలో పథకాల ద్వారా తమకు కలిగిన లబ్ధిని తెలియజేస్తూ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మే13న జరిగే పోలింగ్‌లో రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేసి రాష్ట్రంలో మరలా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బాటలు వేయాలని నాయకులంతా ఓటర్లను కోరారు. పలువురు తటస్థులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన క్షేత్రస్థాయి నాయకులు కూడా ప్రచారంలో పాల్గొని వైఎస్సార్‌సీపీకి తమ మద్దతును స్వచ్ఛందంగా తెలియజేయడంతో ప్రచారానికి వెళ్లిన నాయకులంతా యలమంచిలిలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రచార కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, కొత్తపాలెం వార్డు కౌన్సిలర్ రాపేటి సంతోష్, పిల్లా త్రినాథరావు, డీఎస్ఎన్ రాజు, కొటారు కొండబాబు, బొడ్డేటి సురేష్, నాగు, గొంపాని అప్పారావు, గొంపాని శివ, ఈరిగిల గణేష్ పాల్గొన్నారు.

10 నామినేషన్ల దాఖలు

యలమంచిలి రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ శాసన సభ్య పదవికి బుధవారం 10 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుత ఎమ్మెల్యే కన్నబాబు తనయుడు ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ) నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన వెంట సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు కస్పా రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు సత్య గుప్తా పాల్గొన్నారు. జనసేన తరఫున పోటీ చేస్తున్న సుందరపు విజయ్‌కుమార్ మరో రెండు సెట్ల నామినేషన్లను ఆర్వోకు ఇచ్చారు. టీడీపీ నుంచి ప్రగడ అన్నపూర్ణ, బీఎస్పీ నుంచి లంబ శ్రీనివాసరావు, స్వతంత్ర అభ్యర్థిగా మేరుగు రాజబాబు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దాడి పూర్ణ చంద్రరావు నామినేషన్లను దాఖలు చేశారు.

రోడ్డుకు మరమ్మతులు




తాళ్లపాలెం సంత వద్ద గోతులు పూడ్చి తారు రోడ్డు వేస్తున్న సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం – నర్సీపట్నం రోడ్డుకు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. తాళ్లపాలెం సంత ప్రాంతంలో పడిన గోతులను పూడ్చి వేసి, తారు రోడ్డు వేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు వాహనచోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం రేపు



తిమ్మరాజుపేటలో నూతనంగా నిర్మించిన నూకాంబిక అమ్మవారి ఆలయం



నూకాంబిక అమ్మవారు

మునగపాక : తిమ్మరాజుపేటలో నూతనంగా నిర్మించిన నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో తిమ్మరాజుపేట దళితవాడను ఆనుకొని నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణం జరిగింది. అన్ని హంగులు పూర్తి చేసుకొని శుక్రవారం ప్రారంభానికి ఆలయం ఎదురు చూస్తుంది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

30 మందికి వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి శిరీష

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. సుమారు 30 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఆస్పత్రి ఆయుర్వేద వైద్యాధికారి శిరీష రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆయుర్వేద వైద్య విధానం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. వందేళ్ల చరిత్ర కలిగిన కన్నూరుపాలెం ఆయుర్వేద ఆస్పత్రిలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఉపకరించే మందులు ఉన్నాయని, ఆధునిక పరికరాలతో ఉచిత వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఆరోగ్యానికి ఉపకరించే యోగా, ధ్యానంపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెన్త్ టాపర్లకు, ఉపాధ్యాయులకు సత్కారం



విద్యార్థులను మండల టాపర్లుగా నిలిపిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పీఆర్‌టీయు బృందం

ఎస్.రాయవరం : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను, ఆ పాఠశాల ఉపాధ్యాయులను పీఆర్‌టీయు మండల ఉపాధ్యాయ సంఘ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్నికంటే దార్లపూడి ఉన్నత పాఠశాల విద్యార్థి కె.శంకర్ వరప్రసాద్ 579 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఇదే పాఠశాలకి చెందిన కె.పవన్‌సాయి 575 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులను వీరికి మంచి మార్కులు సాధించేందుకు బోధన చేసిన ఉపాధ్యాయులను పాఠశాలలో పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ నాయకులు భద్రరావు,శ్రీనివాస్, సత్యనారాయణ ఉన్నారు.

ఘనంగా పుష్పయాగం



పూజలందుకుంటున్న ఉత్సవ విగ్రహాలు



కోలాటం ఆడుతున్న కళాకారులు

మునగపాక: మండలంలోని పలు రామాలయాల్లో బుధవారం రాత్రి పుష్పయాగం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మునగపాక పంచాయతీ వీధిలో ఉన్న రామాలయంలో పుష్పయాగం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంఆ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కశింకోటలో...

కశింకోట: స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పుష్పాంజలి సేవను ఘనంగా నిర్వహించా రు. స్వామి కల్యాణోత్సవం ముగింపులో భాగంగా స్వామి వారిని పూలతో అందంగా అలంకరించి పలు రకాల స్వీట్లు, పాలు, పండ్లు, ఇతర పిండి వంటకాలను నివేదించారు. ఈ సందర్భంగా అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

నాతవరం: గ్రామాలు అభివృద్ధి చెందడానికి పంచాయతీ రాజ్ శాఖ చట్టం కీలకమని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ రాజ్ చట్టం విధి విధానాలు, హక్కులు, పంచాయతీల అభివృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన కవలలు



ఉత్తమ ఫలితాలు సాధించిన రియాన, రిషిత

అనకాపల్లి : పదోతరగతి పరీక్షల ఫలితాల్లో స్థానిక ఉమ్మలాడకు చెందిన కవల విద్యార్థులు ప్రతిభ చూపారు. స్థానిక పూడిమడక రహదారిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చదివిన పళ్లా రియానా, పళ్లా రిషితలు ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించారు. రియానా 578 మార్కులు సాధించి స్కూల్‌లో ద్వితీయస్థానంలో, రిషితా 574 మార్కులు సాధించి రిషిత 4వ స్థానంలో నిలిచారు. వీరిని హైస్కూల్ కరస్పాండెంట్ బుధవారం సత్కరించారు.